సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
14 సెప్టెంబర్ 2024
పేజీలు: 02


# మాజీ సీఎస్ సోమేష్‌కుమార్‌కు సీఐడీ నోటీసులు



వాణిజ్య పన్నుల శాఖ కుంభకోణంలో దర్యాప్తును సీఐడి ముమ్మరం చేసింది. రూ.1400 కోట్ల స్కామ్ జరిగినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్‌కు తెలంగాణ సీఐడి పోలీసులు నోటీసులు జారీ చేశారు. వస్తువులు సరఫరా చేయక పోయిన చేసినట్లు, బోగస్ ఇన్వాయిస్ లు సృష్టించారని గుర్తించారు. ఫేక్ ఇన్వాయిస్‌లను సృష్టించి ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్‌తో పాటు మరో ముగ్గురు అధికారులకు నోటీసులు ఇచ్చిన సీఐడీ.. త్వరలోనే అధికారులను విచారించి స్టేట్‌మెంట్‌ను నమోదు చేయనుంది. తెలంగాణలో ఐజీఎస్టీ (ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్) ఎగవేత ద్వారా భారీ మోసం జరిగినట్లు తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ విభాగం పేర్కొంది. ఈ వ్యవహారంపై నమోదైన కేసులో తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ పేరును ఏ-5గా పోలీసులు చేర్చారు. ఇదే కేసులో ఏ-1గా తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, ఏ-2గా ఉప కమిషనర్ ఎ.శివరామ్ ప్రసాద్, ఏ-3గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శోభన్ బాబు, ఏ-4గా ప్లియంటో టెక్నాలజీస్ కంపెనీలు ఉన్నాయి.

### త్వరగా పెండ్లి చేసుకుని

## పిల్లల్ని కనండి

### యువతీ యువకులను వేడుకుంటున్న చైనా



తగ్గిపోతున్న జనాభా, పెరిగిపోతున్న వృద్ధుల సంఖ్యతో చైనా ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతున్నది. దీంతో యువతీ యువకులను త్వరగా పెండ్లి చేసుకోండి, పిల్లల్ని కనండి, ఆలస్యంగా రిటైర్ అవ్వండి అంటూ వేడుకుంటున్నది. యుక్త వయసులోనే యువతీ యువకులకు వివాహాలు చేయించేందుకు నేషనల్ హెల్త్ కమిషన్ (ఎన్‌హెచ్‌సీ) తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అదే సమయంలో జనాభా సంబంధిత సమస్యల నివారణకు పదవీ విరమణ వయసును క్రమంగా పెంచుకుంటూ పోవాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఇటీవల కాలంలో తగ్గుతున్న జనన రేటు ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళన పరుస్తున్నది. ప్రస్తుతం చైనాలోని నిబంధనలు ప్రకారం యువకులు 22 ఏండ్లు నిండిన తర్వాత, యువతులు 20 ఏండ్ల తర్వాత మాత్రమే వివాహం చేసుకోవాలి. అయితే పిల్లల పెంపకానికి అధిక ఖర్చు కావడం, కెరీర్‌కు సంబంధించిన లక్ష్యాలు, కొన్ని సంప్రదాయ కట్టుబాట్ల కారణంగా చాలామంది మహిళలు పిల్లలను కనడానికి సందేహిస్తున్నారు. ఈ క్రమంలో త్వరగా పెళ్లి చేసుకుని, తొందరగా పిల్లల్ని కనాలంటూ చైనా నినదించనుంది. అందులో భాగంగానే రిటైర్మెంట్ వయసును కూడా పురుషులకు 60 నుంచి 63కు, మహిళలకు 50 నుంచి 55కు ఆయా ఉద్యోగాలను బట్టి పెంచాలని యోచిస్తున్నది. దీనిని 2025లో ప్రారంభించి 2040కు పూర్తి చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది.



### 42 ఏళ్ల తర్వాత తొలిసారి

# దోడాకు మోదీ

పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు కేంద్రపాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్ సిద్ధమవుతోంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి జరగనున్న ఈ ఎన్నికల పోరుకు అన్ని పార్టీలు వ్యూహరచనల్లో తలమునకలయ్యాయి. ఎవరికివారే ఎదుటువారిని దెబ్బకొట్టేలా ఎత్తుగడలు వేస్తుండటంతో రాష్ట్రంలో ఎన్నికల హీట్ పెరిగింది. కాగా జమ్ముకశ్మీర్‌లో కమలం వికసించేలా బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తర్వాత తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్ నుంచి ఎన్నికల సందడి చేస్తున్నారు. నేడు(శనివారం) ఉదయం 11 గంటలకు దోడాలో జరిగే ర్యాలీలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు జమ్ములో అధికారులు భారీ భద్రతా ఏర్పాటు చేశారు. ఎన్నికల ర్యాలీ శాంతియుతంగా, సజావుగా జరిగేందుకు దోడా, కిష్త్వార్ జిల్లాల వ్యాప్తంగా బహుళ అంచెల భద్రతను మోహరించారు. అయితే గత 42 ఏళ్లలో దోడాలో ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. చివరిసారిగా 1982లో దోడాలో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక జమ్మూ కశ్మీర్ ఎన్నికలతోపాటు హర్యానా అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. మూడోసారి అధికారం చేపట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే మోదీ దోడా పర్యటన తర్వాత హర్యానాలోని కురుక్షేత్రలో తన మొదటి ఎన్నికల ర్యాలీలో ప్రసంగించనున్నారు. జమ్మూ కశ్మీర్ ఎన్నికలు మూడు దశల్లో సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1 న జరగనున్న విషయం తెలిసిందే. ఇక అక్టోబర్ 5న హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. రెండు రాష్ట్రాలకు అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.



## మణిపూర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం ఎత్తివేత

మణిపూర్‌లోని 5 జిల్లాల్లో ఇంటర్నెట్‌పై నిషేధాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఇంటర్నెట్ కనెక్షన్ ఐపీతోనే సేవలు పొందవచ్చని, రూటర్స్ వైఫై/హాట్‌స్పాట్ ద్వారా అనుమతి ఉండదని చెప్పింది. మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధం కొనసాగుతుందని తెలిపింది. మిలిటెంట్ల దాడులను నిరసిస్తూ సెప్టెంబర్ 10న విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఘర్షణ వాతావరణం ఏర్పడి 80 మంది గాయపడ్డారు. దీంతో ప్రభుత్వం ఇంటర్నెట్‌పై నిషేధం విధించింది.



## కారుపైకి ఎక్కి జగన్‌కు ముద్దుపెట్టిన అభిమాని

వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలో భద్రతా వైఫల్యం ఉందని వైసీపీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. నిన్న పిఠాపురం నియోజకవర్గంలోని మాధవపురంలో జగన్ పర్యటిస్తుండగా.. ఓ అభిమాని కారుపైకి ఎక్కి జగన్‌పై పడిపోతూ ముద్దులు పెట్టిన ఘటనను ఉదాహరణగా చూపిస్తున్నాయి. అతడు జగన్ వద్దకు దూసుకెళ్తుంటే మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అతడి కాలు పట్టుకుని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు భద్రత పెంచాలని వైసీపీ శ్రేణులు కోరుతున్నాయి.




## సముద్రంలో భారీ దేవర కటౌట్

జూ.ఎన్టీఆర్ 'దేవర' క్రేజ్ రోజురోజుకీ పీక్స్‌కు చేరుకుంటోంది. ఇదిలా ఉంటే చిత్ర యూనిట్ వినూత్నంగా ప్రమోషన్స్ చేస్తోంది. తాజాగా ముంబైలోని దాదర్ చౌపటీ బీచ్ వద్ద సముద్రంలో భారీ 'దేవర' కటౌట్ ఏర్పాటు చేసింది. గణేశ్ నిమజ్జనం చేసేటప్పుడు ఈ కటౌట్ చూడవచ్చని దేవర టీమ్ ట్వీట్ చేసింది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుందీ చిత్రం.



సోనమ్‌ప్రీత్ బజ్వా అంటే చాలామందికి తెలియక పోవచ్చుగానీ 2016లో విక్టరీ వెంకటేశ్ నటించిన 'బాబు బంగారం' చిత్రంలో దండమే పెట్టుకొంటాం అనే ఓ పాటలో.. ఆ తర్వాత సుశాంత్ 'ఆటాడు కుందాం రా' సినిమాలో నటించి.. తెలుగు ప్రేక్షకులకు సోనమ్ బజ్వా పరిచయమైంది. మొదట 2014లో మన తెలుగువాడు వైభవ్ నటించిన తమిళ సినిమా 'కప్పాల్'తో సినిమాల్లోకి ప్రవేశించిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం పంజాబీ చిత్రాలు మాత్రమే చేస్తూ.. టాప్ హీరోయిన్‌గా, హయ్యెస్ట్ పేయిడ్ కథానాయికగా రాణిస్తోంది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది సోనమ్ బజ్వా నిత్యం హాటుహాటు ఫొటోలను, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. తరుచూ బికినీల్లో దర్శనమిచ్చే ఈ భామ.

## మత్తెక్కిస్తున్న సోనమ్

## గుజరాత్‌లో తీవ్ర విషాదం

గుజరాత్‌లోని దేగాం తాలూకాలో జరిగిన వినాయక నిమజ్జనంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒకే గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు నీటిలో మునిగి చనిపోయారు. వస్నా సోగ్తికి చెందిన కొందరు యువకులు గణేషుడిని నిమజ్జనం చేసేందుకు మాషో నదికి వెళ్లారు. నిమజ్జనం అనంతరం ఓ యువకుడు ఈత కొడుతూ మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు ఒకరి తర్వాత మరొకరు నీటిలో దూకి మునిగిపోయారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు.



## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో టీడీపీ?

త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. కృష్ణా-గుంటూరు, తూర్పుగోదావరి-పశ్చిమగోదావరి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నిన్న ఈ నాలుగు జిల్లాల నేతలతో టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమావేశమయ్యారు. అభ్యర్థులు ఎవరైతే బాగుంటుందో సలహాలు, సూచనలు ఇవ్వాలని వారిని కోరారు. పోటీ చేసేందుకు నేతలు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం.

## విరాట్ కోహ్లీ నా సెలబ్రిటీ క్రష్

టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన సెలబ్రిటీ క్రష్ అని హీరోయిన్ అనన్య పాండే తెలిపారు. కోహ్లీ తన ఫేవరెట్ క్రికెటర్ అని కూడా ఆమె చెప్పారు. 'కాల్ మీ బే' ప్రమోషన్లలో ఆమె మాట్లాడారు. 'కోహ్లీ గ్లోబల్ ఐకాన్. ఆయనలో ఏదో తెలియని శక్తి ఉంది. విరాట్‌లోని నాయకత్వ లక్షణాలు, జట్టును నడిపించిన తీరు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి' అని ఆమె పేర్కొన్నారు.





## మంచిర్యాల, పెద్దపల్లిలోనూ వందేభారత్ ఆపాలని డిమాండ్


సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య ఈ నెల 16 నుంచి వందేభారత్ రైలు పట్టాలెక్కనుంది. తెలంగాణలో ప్రస్తుతం రామగుండం, కాజీపేట స్టేషన్లలోనే హాల్టింగ్ సౌకర్యం ఉంది. జిల్లా కేంద్రాలైన మంచిర్యాల, పెద్దపల్లిలోనూ ఈ రైలును ఆపాలని ప్రయాణికులు కోరుతున్నారు. మంగళవారం మినహా నాగ్‌పూర్‌లో ఉ.5 గంటలకు బయల్దేరి మ.12.15 గం.కు ఈ రైలు సికింద్రాబాద్ చేరుతుంది. మ.ఒంటి గంటకు SCలో బయల్దేరి రాత్రి 8.20 గంటలకు నాగ్‌పూర్ చేరుతుంది.


సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ప్రియాంక చోప్రా బికినీ ట్రీట్..



గ్లోబర్ స్టార్ ప్రియాంక చోప్రా సోషల్ మీడియాలో చేసే అందాల విందు మామూలుగా ఉండదు. భర్త నిక్ జోనస్‌తో కలిసి ప్రియాంక చేసే అందాల ప్రదర్శనకు అందరూ ఫిదా అవ్వాల్సిందే. ఇక ప్రియాంక స్పెషల్ ఈవెంట్లకు ధరించే దుస్తులు, బికినీ ట్రీట్‌లు మామూలుగా ఉండవు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్‌లో ఎన్నో హిట్ సినిమాల్లో నటించి.. ఆ తర్వాత 'క్వాంటికో' అనే వెబ్ సిరీస్‌తో హాలీవుడ్‌కి వెళ్లింది నటి ప్రియాంక చోప్రా. తన నటనతో అక్కడి ప్రేక్షకులను కూడా మెప్పించి ఇంటర్నేషనల్ స్టార్‌గా గుర్తింపు తెచ్చుకుంది. పాప్ సింగర్ నిక్ జోనస్‌ని వివాహం చేసుకున్న తర్వాత ఆమె పూర్తిగా హాలీవుడ్‌లోనే సెటిల్ అయిపోయింది. తాజాగా బికినీ ధరించి.. ఆ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకుంది.





## రెచ్చగొడితే.. నాలుక కోస్తాం: జగ్గారెడ్డి

కాంగ్రెస్ కార్యకర్తల్ని ఎందుకు రెచ్చగొడుతున్నారు? రేవంత్‌రెడ్డిని తిడితే మా కార్యకర్తలు వాళ్ల నాలుకలు కోస్తారంటూ ఆ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌ను చెడ్డగొట్టాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారంటూ మండిపడ్డారు. "రేవంత్‌ను ఎవరైనా పనికిమాలిన వాడు అంటే సహించేది లేదు. సీఎంపై కేసీఆర్, కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే నాలుకు కోస్తాం. బీఆర్ఎస్ నేతలు.. హైదరాబాద్ ప్రజల మూడ్‌ను ఖరాబ్ చేశారు. గాంధీ, కౌశిక్ రెడ్డి వ్యవహారం బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారం. వినాయక నిమజ్జనం కోసం కష్టపడుతుంటే.. బీఆర్ఎస్ అనవసర పంచాయతీలు చేస్తున్నారు. వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని డిస్టబ్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది" అంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.



## హైదరాబాద్ ప్రజలపై సీఎం రేవంత్ పగ: కేటీఆర్

"పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కండువాలు కప్పే సాంప్రదాయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లేదు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కొత్త సాంప్రదాయాని కేసీఆర్ తెరలేపాడు. 2014-18 వరకు కాంగ్రెస్ ఎంపీలు 4, ఎమ్మెల్యేలు 25, ఎమ్మెల్సీ 18 మందిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడలేదు?. పార్టీ మారిన వారికి మంత్రి పదవి ఇచ్చింది కేసీఆర్ కాదా.. పార్టీ ఫిరాయింపులకు ఆధ్యుడు కేసీఆర్ కాదా.. శాసన పక్షాన్ని విలీనం చేసుకునే కుట్రకు కేసీఆర్ కారణం. కేటీఆర్ చరిత్ర తెలుసుకో.. కేసీఆర్ సీఎం అయిన రోజే రాజకీయాలలో విలువలు నశించాయి. బీజేపీ డైరెక్షన్‌లో కేసీఆర్.. కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచారు" అంటూ జగ్గారెడ్డి మండిపడ్డారు.



# కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
# ఇద్దరు సైనికులు మృతి

జమ్మూకశ్మీర్‌లోని కిష్టవార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో వైపు కథువాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను రైజింగ్ స్టార్ కార్ప్స్ హతమార్చారు. కిష్టవార్‌లో ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం వచ్చిందని, దాని ఆధారంగా చాట్రూ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టామని, 15.30 నిమిషాల సమయంలో ఉగ్రవాదుల ఆచూకీ చిక్కిందని, ఆ సమయంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు మరణించినట్లు ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం అక్కడ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు ఆర్మీ వెల్లడించింది. కిష్టవార్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న ఉగ్రవాదులే జూలైలో దోడాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నారు. అక్కడ జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు సైనికులు మృతిచెందిన విషయం తెలిసిందే. కశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ



నేపథ్యంలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం శాంతిభద్రతల సమస్యగా మారింది. సెప్టెంబర్ 18వ తేదీన దోడా, కిష్టవార్, రాంబన్, అనంతనాగ్, పుల్వామా, సోఫియాన్, కుల్గామ్ జిల్లాల్లో పోలింగ్ జరగనున్నది. ప్రధాని మోదీ ఆదివారం జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. జమ్మూ, కథువాలో సెప్టెంబర్ 25, సాంబా జిల్లాలో అక్టోబర్ ఒకటో తేదీన పోలింగ్ జరగనున్నది.



## 20న తెలంగాణ కేబినెట్ భేటీ

సచివాలయంలో ఈ నెల 20న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ కేబినెట్ భేటీ జరగనుంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇందులో చర్చించనున్నారు. రాష్ట్రంలో వరదలు, కేంద్ర ప్రభుత్వం సాయంపై సమావేశంలో ప్రస్తావించనున్నారు. హైడ్రా పని విధానం-దీని చట్టబద్ధతకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశం, బీసీ రిజర్వేషన్, కులగణన, 200 పంచాయతీల ఏర్పాటు, రుణమాఫీ, రైతుభరోసాపై చర్చించే అవకాశం ఉంది.




## యూపీఐ పేమెంట్లు చేసే వారికి శుభవార్త

కొన్ని యూపీఐ లావాదేవీలకు ఒకేసారి రూ.5లక్షల వరకు చెల్లింపులు చేసే సదుపాయం రేపటి(సెప్టెంబర్ 15) నుంచి అందుబాటులోకి రానుంది. ఇటీవల జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఈ నిర్ణయానికి ఆర్‌బీఐ ఆమోదం తెలపగా, తాజాగా ఎన్‌పీసీఐ ఇందుకు అనుమతిచ్చింది. ఆదాయపు పన్ను చెల్లింపులు, ఆసుపత్రి, విద్యాసంస్థల బిల్లులు, ఐపీఓ దరఖాస్తులు, ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోలుకు యూపీఐ ద్వారా ఒకేసారి రూ.5లక్షల చెల్లింపులు చేయవచ్చు.


## నిర్మలాసీతారామన్‌పై స్టాలిన్ మండిపాటు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌పై తమిళనాడు సీఎం స్టాలిన్ మండిపడ్డారు. ఆమెది అహంకారమని,ఆమె తీరు సరిగా లేదని విమర్శించారు. ఇటీవల కోయంబత్తూరులో జీఎస్టీపై జరిగిన సమావేశంలో ఓ రెస్టారెంట్ చైన్ యజమాని శ్రీనివాసన్ నిర్మలాసీతారామన్‌ను ప్రశ్నించారు. జీఎస్టీలోని లోపాలను ఎత్తి చూపేందుకు బన్, క్రీమ్, క్రీమ్ బన్‌లపై విధిస్తున్న జీఎస్టీ పన్నును సోదాహరణంగా వివరించారు. ఇది అక్కడ సమావేశంలో ఉన్నవారికి నవ్వు తెప్పించింది. దీంతో అక్కడున్నవారంతా విరగబడి నవ్వారు. ఏమైందో తెలియదు కానీ ఆ తర్వాత జరిగిన ప్రైవేట్ భేటీలో శ్రీనివాసన్ నిర్మలకు క్షమాపణ చెబుతున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.



## ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు..
### రద్దీగా మెట్రో స్టేషన్

ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఖైరతాబాద్ గణేశుడి దర్శనానికి ఎల్బీనగర్, మియాపూర్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో మెట్రో స్టేషన్ పరిసరాలు సందడిగా మారాయి. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఖైరతాబాద్ గణేశుడికి భక్తుల తాకిడి పెరిగింది. దీంతో మెట్రో రైలు యాజమాన్యం భక్తులకు ఎలాంటి ఇబ్బందికలగకుండా ఏర్పాట్లు చేస్తోంది. టికెట్ కౌంటర్లు, ఎగ్జిట్ గేట్ల వద్ద రద్దీ పెరగకుండా తగిన చర్యలు చేపట్టింది. క్యూఆర్ కోడ్ టికెట్లకు, కార్డ్ ద్వారా వెళ్లే ప్రయాణికులను వేర్వేరుగా పంపిస్తోంది. స్టేషన్ లోపల ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ముందస్తుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని, కార్డులో సరిపడా డబ్బులు లేకపోతే ఎంట్రీ స్టేషన్‌లో రీఛార్జ్ చేసుకోవాలని ప్రయాణికులకు సూచిస్తున్నారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌లో ఉదయం నుంచి గంట గంటకు రద్దీ పెరుగుతుండటంతో మెట్రో యాజమాన్యం అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. టికెట్ కౌంటర్లు, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లతోపాటు ప్లాట్ ఫాం వద్ద భద్రతా సిబ్బంది ప్రయాణికులకు తగిన సూచనలు చేస్తున్నారు.




## నిమ్స్‌కు యూకే బృందం..
## 22 నుంచి చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు

గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిమ్స్‌లో ఉచితంగా వైద్య సేవలందించేందుకు యూకే వైద్య బృందం దవాఖానకు రానున్నదని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. యూకేలో స్థిరపడ్డ డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలో ప్రతి ఏటా వారం రోజుల పాటు నిమ్స్ భాగస్వామ్యంతో గుండె సమస్యలున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 22 నుంచి 28 తేదీల్లో యూకే నుంచి డాక్టర్ రమణ నేతృత్వంలో ఫిల్ ఆర్నాల్డ్, గీతా, ఆనంద్ వాఘ్, నాగకిశోర్, బ్రాస్ అటాండి, నిమ్స్ దవాఖాన కార్డియోథోరాసిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేశ్వరరావు, సీనియర్ వైద్యులు గోపాల్, వైద్య సిబ్బందితో కలిసి ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. గుండె సమస్యలున్న పిల్లలు నిమ్స్ కార్డియోథోరాసిక్ విభాగం వైద్యులను సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

## అంతరిక్షం నుంచే ఓటు వేయనున్న సునీతా విలియమ్స్

10 రోజుల అంతరిక్ష యాత్ర కోసం.. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్-ఐఎస్ఎస్‌కు వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అక్కడే చిక్కుకుపోయారు. బోయింగ్ స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో సునీతా విలియమ్స్‌తోపాటు బుచ్ విల్‌మోర్.. ఈ ఏడాది జూన్ 5వ తేదీన అంతరిక్షంలోకి వెళ్లారు. అయితే స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం కారణంగా వారు అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారిని తీసుకువచ్చేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ-నాసా రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. అయితే వారు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు అంతరిక్షంలోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఎర్త్ టు స్పేస్ కాల్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. దీనికోసం ఐఎస్ఎస్‌లో న్యూస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ స్పేస్ కాల్‌లో సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్.. తమ అనుభవాలను పంచుకున్నారు. బోయింగ్ స్టార్‌లైనర్ తమను విడిచిపెట్టి వెళ్లడం కఠినంగా అనిపిస్తోందని సునీతా విలియమ్స్ తెలిపారు. ఈ కారణంగా మరికొన్ని నెలలు తాము స్పేస్‌లోనే ఉండాల్సిన



పరిస్థితి నెలకొందని వెల్లడించారు. అయినా అంతరిక్షంలో ఉండటం ఆనందంగా ఉందని.. ఇది కూడా తమ విధుల్లో భాగమే అని భావిస్తున్నట్లు చెప్పారు. తనకు ఇది హ్యాపీ ప్లేస్ అని.. అక్కడ ఉండేందుకు సర్దుబాటు చేసుకుంటున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే తన కుటుంబ సభ్యులను బాగా మిస్ అవుతున్నట్లు తెలిపారు. ఇక స్పేస్‌లో ఉండటం ఎలాంటి ఇబ్బందికి గురిచేయడం లేదని బుచ్ విల్‌మోర్ తెలిపారు.